ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జిల్లాలో ఓటరు చైతన్య కార్యక్రమాలు
- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, మార్చి 26: ఓటుహక్కు కలిగిన ప్రతి ఒక్కరూ మే 13న జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో వినియోగించుకోవాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. ములుగురోడ్డు సమీపంలోని ఎల్‌బీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి అన్వేశ్ చింతల అధ్యక్షతన మంగళవారం స్వీప్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్-2024 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంపై కలెక్టర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, ఓయూ ప్రొఫెసర్ పి.నవీన్‌కుమార్, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపల్లి మధు, ఎల్బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ, డీహెచ్‌రావు, స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీరమాకాంత్, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ నారాయణ పాల్గొన్నారు.

మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. సిబ్బందికి ఈ నెల 31న, ఏప్రిల్ 1, 2వ తేదీల్లో హనుమకొండలోని కేడీసీ, పరకాలలోని పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

వేసవి దృష్ట్యా నగరంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరాలో సమ్మర్ యాక్షన్ ప్లాన్, వార్షిక నిర్వహణపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమీక్షించారు. కార్పొరేషన్ పరిధిలో అంతరాయం లేకుండా తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తదితరులు పాల్గొన్నారు.

వీసీకి హాజరైన కలెక్టర్

హనుమకొండ : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం హైదరాబాద్ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, తాగునీటి సరఫరాపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ సిక్తా పట్నాయక్, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అడిషనల్ కలెక్టర్లు రాధికాగుప్తా, వెంకట్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్డీవో నాగ పద్మజ, డీసీఎస్‌వో వసంతలక్ష్మి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం మహేందర్, అగ్రికల్చర్ జేడీ రవీందర్ సింగ్, డీసీవో నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

శాయంపేట చేనేత సొసైటీ బకాయిలు ఇప్పిస్తా..

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- గత సర్కారు పథకాలు అందించాలి : కార్మికులు

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

శాయంపేట, మార్చి 26 : శాయంపేట చేనేత పారిశ్రామిక సహకార సంఘానికి టెస్కో నుంచి రావాల్సిన బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం ఆయన చేనేత సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం అమలుచేసిన పథకాలను ఇప్పుడు నిలిపివేశారని, దీంతో తాము దిక్కుతోచని స్థితిలో పడ్డామని కార్మికులు వాపోయారు. సంఘంలో రూ.20లక్షల విలువైన వస్త్రాలు పేరుకుపోయాయని, టెస్కో నుంచి రూ.16లక్షల సొమ్ము రావాల్సి ఉన్నట్లు చెప్పారు. సంఘంలో 100 మందికి 30 మందికే ఉపాధి దొరుకుతున్నదని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో అమలైన పథకాలను అమలు చేసేలా చూస్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల వద్దకు పార్లమెంట్ ఎన్నికల తర్వాత సొసైటీ పాలకవర్గాన్ని తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, సొసైటీ చైర్మన్ మామిడి శంకర్‌లింగం, పీఏసీ మెంబర్లు బూర లక్ష్మీనారాయణ, ప్రభాకర్, ఆనందం, దూదిపాల బుచ్చిరెడ్డి, చల్లా చక్రపాణి, పోలెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, చిందరం రవి, నాగరాజు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలి

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

సమావేశంలో మాట్లాడుతున్న ఏఆర్‌వో, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మార్చి 26 : ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఏఆర్‌వో, గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో తూర్పు నియోజవర్గ పరిధిలోని నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, ఎఫ్ఎస్టీ, వీఎస్టీలకు అందే ఫిర్యాదులపై తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. నియోజవర్గంలో 3,909 పోస్టల్ బ్యాలెట్‌లు ఉన్నాయని, ఇప్పటికే 1,762 పంపిణి చేశామన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఫారం 12(డీ) పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎంసీసీ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. నియోజవర్గంలోని 230 పోలింగ్ స్టేషన్లలో దివ్యాంగుల కోసం వీల్‌చైర్లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్, కుడా ప్లానింగ్ అధికారి అజిత్‌రెడ్డి, బల్దియా సెక్రటరీ విజయలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, ఏసీపీ నందిరాంనాయక్, తహసీల్దార్‌లు ఇక్బాల్ అహ్మద్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వృథాను అరికట్టాలి

తాగునీటి వృథాను అరికట్టాలని, పైప్‌లైన్ లీకేజీల మరమ్మతుపై దృష్టి సారించాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్‌లో తాగునీటి సరఫరాపై ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరంలోని చివరి ఇంటి వరకు తాగునీటి సరఫరా జరుగాలన్నారు. ట్రయల్ అండ్ ఎర్రర్‌లో భాగంగా సమస్యలు పరిష్కరించాలన్నారు. కొత్త ప్రాంతాల్లో తాగునీటి సరఫరా కోసం పైప్‌లైన్‌లకు వాల్వ్ బిగించాలని సూచించారు. వరంగల్, హనుమకొండలోని ప్రధాన కూడళ్లలో చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు బీఎల్ శ్రీనివాసరావు, రాజయ్య, సంజయ్‌కుమార్, శ్రీనివాస్, డీఈలు సారంగం, రవికిరణ్, రంగారావు, ఏఈలు పాల్గొన్నారు.

టీఎస్ బీపాస్ నిబంధనలు పాటించాలి..

భవన నిర్మాణదారులు టీఎస్ బీపాస్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని కమిషనర్ అశ్విని తానాజీ అన్నారు. నగరంలోని ఆకుతోట కన్వెన్షన్ హాల్, వాల్ మార్ట్, పాతబీటు బజార్ ప్రాంతాల్లో నిర్మించే భవనాల స్థలాలను పరిశీలించారు. టీఎస్ బీపాస్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ వెంకన్న, సీఎంహెచ్‌వో రాజేశ్, టీపీవోలు సుష్మ, బషీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

హనుమకొండ చౌరస్తా, మార్చి 26 : జిల్లావ్యాప్తంగా మంగళవారం జరిగిన పదో తరగతి భౌతికశాస్త్రం పరీక్షలో రెగ్యులర్ విద్యార్థులు 12,018 మంది హాజరు కాగా, ప్రైవేట్ విద్యార్థులు 197 మంది హాజరైనట్లు డీఈవో అబ్దుల్ హై తెలిపారు. జిల్లా పరిశీలకులు 4 పరీక్షా కేంద్రాలు, జిల్లా విద్యాశాఖాధికారి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కలిసి 5 పరీక్షా కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 14 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు చెప్పారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.

మహిళపై దాడి.. ఐదుగురిపై కేసు నమోదు

పరకాల, మార్చి 26 : ఇంటి స్థలం వివాదంలో బంధువులు మహిళపై దాడి చేసిన ఘటన నాగారంలో జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అమ్మ రాజమ్మ భర్త గతంలో మృతి చెందాడు. తన ఇద్దరు కూతుళ్లకు వివాహాలు జరుగడంతో ఒంటరిగా ఉంటోంది. ఇంటి స్థలం విషయంలో బంధువులతో తరచూ గొడవలు జరుగుతుండేవి. పలుమార్లు పంచాయతీలు కూడా జరిగాయి. కాగా, సోమవారం రాత్రి అమ్మ రవి, రాజు, సునీత, ప్రమీల, రజిత ఇంట్లోకి చొరబడి రాజమ్మపై దాడి చేశారు. స్థానికులు గాయపడిన రాజమ్మను ప్రైవేట్ దవాఖానకు తరలించారు. రాజమ్మ కుమార్తె యార రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

ల్యాండ్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణ

పరకాల, మార్చి 26 : న్యాక్ ఆధ్వర్యంలో ల్యాండ్ సర్వేయర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా లేబర్ కార్డు కలిగి ఉన్న 18నుంచి 35 సంవత్సరాల వయస్సు గల డిపెండెంట్స్‌కు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఇంటర్, ఐటీఐ, సివిల్ డిప్లొమా ఉన్న వారు అర్హులన్నారు. శిక్షణ కాలంలో మధ్యాహ్న భోజనం, యూనిఫాం, స్టేషనరీ ఐటమ్స్ ఉచితంగా అందిస్తామని, వివరాలకు 9441997438, 9581483526 నంబర్లలో లేదా ఎస్సీ బాయ్స్ హాస్టల్ ఆవరణలో ఉన్న న్యాక్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఉడుతలను చంపిన ఇద్దరి అరెస్టు

శాయంపేట, మార్చి 26 : ఉడుతలను వేటాడి చంపిన ఇద్దరిని ఫారెస్టు అధికారులు అరెస్టు చేశారు. వైల్డ్‌లైఫ్ జిల్లా కమిటీ సభ్యుడు సునీల్ కథనం ప్రకారం.. శాయంపేట మండలం పత్తిపాక గ్రామ పరిధిలోని స్టోన్ క్రషర్ సమీపంలో ఉడుతలను చంపినట్లు సమాచారం వచ్చిందన్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండికి చెందిన పడ్డం సాయి, సిరిగిరి పవన్ రెండు ఉడుతలను వేటాడి చంపినట్లు తెలిపారు. అటవీశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించామని చెప్పారు. ముందుగా వీరిని శాయంపేట పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అనంతరం ఫారెస్టు బీట్ అధికారి నూతన్‌లాల్ ఇద్దరిని ఆఫీసుకు తరలించారన్నారు.

వృద్ధుడిని చేరదీసిన సహృదయ ఆశ్రమం

కాజీపేట, మార్చి 26 : నగరంలో ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురైె స్పృహ కోల్పోయిన ఓ అనాథ వృద్ధుడిని ప్రశాంత్ నగర్‌లోని సహృదయ అనాథ వృద్ధ ఆశ్రమ నిర్వాహకురాలు యాకూబీ చోటు మంగళవారం చేరదీసింది. అదాలత్ బస్ షెల్టర్‌లో ఓ అనాథ వృద్ధుడు ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురైనట్లు ప్రయాణికులు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి వెళ్లి వృద్ధుడికి వైద్య సేవలు అందించి, ఆశ్రమంకు తరలించారు. వృద్ధుడు ఖమ్మం పట్టణంలోని బుర్హాన్‌పూర్ వీధికి చెందిన మహ్మద్ పాషా(75)గా గుర్తించామని, మూడేళ్లుగా సుబేదారి ప్రాంతంలో భిక్షాటన చేసి, రాత్రి వేళల్లో అదాలత్ బస్టాప్ ప్రాంగణంలో సేద తీరేవాడని యాకూబ్ చోటు తెలిపారు.

టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ

హనుమకొండ చౌరస్తా, మార్చి 26 : టెట్ దరఖాస్తు ఫీజును తగ్గించాలని, 33 జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని లేఖ ద్వారా కోరారు. గత ప్రభుత్వంలో టెట్ ఒక పేపరు దరఖాస్తు ఫీజు రూ. 200, రెండు పేపర్లకు రూ.300 ఉండేదని, ప్రస్తుత పేపర్‌కు రూ.1, 000 రెండు పేపర్లకు రూ.2,000 పెంచడం సరికాదన్నారు. ఏడు లక్షల మంది నిరుద్యోగుల సమస్యను పరిగణనలోకి తీసుకుని టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలని డిమాండ్ చేశారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s: Shriram Finance Limited, Huzurabad Branch. I issue the following notice to general public. My client intends to grant to loan to title Myakala Ramadevi, W/o: Narayana Reddy, Age: 56 years, Oce: House hold, R/o:H.No. 3- 30. Ananthasagar village Hasanparthy mandal of Hanamakonda dist by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges mortgages Sale agreements Court Attachment, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 3 days from the date of this notice otherwise, later objections will not bind my client in this regard

SCHEDULE OF THE PROPERTY

All that the Existing RCC Residential house with open place property bearing GP H.No. 3- 145/28, to an extent of 229.44 Square yards or 191.83 Square meters, covered with RCC ground floor plinth area 465.00 Square feets, within the boundaries.
East: 30'-0" Road,West: Land of B. Pradeep Reddy,North: Land of Narayana Reddy, South: House of M. Rama Devi,Is situated at Ananthasagar village Hasanparthy mandal of Hanamakonda dist
Date: 26-03-2024

Sd/- G. LAXMANA MURTHY, Advocate
Huzurabad. Cell No. 94403 69866

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★HNK లగ్జరీ ఎంటర్ ప్రైజెస్ వెయ్యి స్తంభాల గుడి ప్రక్కన Air Coolor & ఫర్నిచర్ షాపులో పని చేయడానికి సెల్స్ గర్ల్స్, సెల్స్ బాయ్స్, సూపర్ వైజర్, హెల్పర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర:9347881523.
NTW-321500

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ

సంగెం, మార్చి 26 : సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం హనుమకొండలోని భవానీ నగర్‌లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో ఎంపీపీతో పాటు ఆమె భర్త నరహరి, మరో ఇద్దరు ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

'చేనేత మిత్ర కొనసాగించాలి'

శాయంపేట, మార్చి 26: రాష్ట్రంలోని చేనేత కార్మికులకు గత ప్రభుత్వం అమలు చేసిన చేనేత మిత్ర పథకాన్ని కొనసాగించాలని, సిరిసిల్లలో మూతబడిన పవర్‌లూమ్స్ పరిశ్రమలను తెరిపించాలని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి వంగర సాంబయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన హైదరాబాద్‌లో చేనేత, జౌళి శాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ సర్కారు గత పథకాలను కొనసాగించి ఎన్నికలు నిర్వహించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు ఆయన తెలిపారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దాసు

హనుమకొండ, మార్చి 26 : ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రొఫెసర్ కొమ్ముగారి దాసును నియమించినట్లు రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు కేదాసి మోహన్ తెలిపారు. మంగళవారం నక్కలగుట్టలోని హరిత హోటల్‌లో జరిగిన నాయకుల సమావేశానికి హాజరయ్యారు. నాయకులు మెట్టుపల్లి కొమురయ్య, బాలస్వామి, బొట్ల రమేశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాజీపేట, మార్చి 26: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. కాజీపేట పట్టణంలోని విష్ణుపురికి చెందిన నల్లెల శ్రీనివాస్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో పీడీగా పని చేస్తున్నాడు. ఈ నెల 24న తన భార్య పద్మతో కలిసి హసన్‌పర్తిలో జరిగిన శుభకార్యానికి వచ్చాడు. తిరిగి కాజీపేటకు బైక్‌పై వస్తుండగా రహమత్‌నగర్ చౌరస్తాలో రోడ్డు క్రాస్ చేస్తుండగా ఆటో ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్ తల, నుదుటికి గాయాలయ్యాయి. హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకృష్ణ తెలిపారు.

అప్పు తీర్చలేక మహిళ ..

హసన్‌పర్తి : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. సీఐ సురేశ్ కథనం ప్రకారం.. మండలంలోని కొత్తపెల్లికి చెందిన పెస్తం మౌనిక, నాగరాజు దంపతులు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అప్పులు పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురైన మౌనిక ఈనెల 19న ఇంట్లో క్రిమిసంహారక మందు తాగింది. ఆమెను ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కాజీపేట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడు నిద్రలోనే..

కాజీపేట : స్టేషన్‌లోని 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై మంగళవారం లిఫ్ట్ వద్ద గుర్తు తెలియని ప్రయాణికుడు పడుకుని నిద్రలోనే చనిపోయాడు. అతడి జేబులో కల్యాణ్ రైల్వే జంక్షన్ నుంచి కాజీపేటకు తీసుకున్న రైలు టికెట్ లభించిందని చెప్పారు. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు, మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం దవాఖాన మార్చురీలో భద్రపరిచామన్నారు. మృతుడి సంబంధికులు 8712658609, 9949859108 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సీఐ

హనుమకొండ చౌరస్తా, మార్చి 26 : మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మట్టెవాడ సీఐ గోపి విద్యార్థులకు సూచించారు. మంగళవారం వరంగల్ ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ సీతారాములు, ప్రిన్సిపాల్ జుమ్లానాయక్, ఏటూరునాగారం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, ట్రైనింగ్ ఆఫీసర్స్ రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

పుట్టిన ఊరు రుణం తీర్చుకోవడమే లక్ష్యం

యశోద హాస్పిటల్ కార్డియాలజిస్టు శ్రీనివాస్‌రెడ్డి

నల్లబెల్లి, మార్చి 26: పుట్టిన ఊరు రుణం తీర్చుకోవడమే యశోద ఆసుపత్రి లక్ష్యమని గుండె వైద్యనిపుణుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాంపూర్ గ్రామంలోని యశోద సేవా కేంద్రంలో మంగళవారం హైదరాబాద్‌లోని యశోద వైద్యశాల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గుండె సంబంధిత, న్యూరో, ఆర్థో, మహిళా సంబంధిత వ్యాధులు, గ్యాస్ట్రో, జనరల్ ఫిజీషియన్ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. యశోద వైద్యశాల చైర్మన్లు ఓరుకంటి రవికుమార్‌రావు, రవీందర్‌రావు, సురేందర్‌రావు, దేవేందర్‌రావు, నాగేందర్‌రావు, పలువురు వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. మాజీ సర్పంచ్ సురేశ్‌రావు ఏర్పాట్లు చేయించారు.

కేయూ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతిగా వెంకటయ్య

హనుమకొండ చౌరస్తా, మార్చి 26 : కేయూ పొలిటికల్ సైన్సు విభాగం నూతన ఇన్‌చార్జి, విభాగాధిపతిగా పొలిటికల్ సైన్స్ ఒప్పంద అధ్యాపకుడు వెంకటయ్యను నియమిస్తూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ నరసింహచారి ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటయ్య 2004వ సంవత్సరంలో పొలిటికల్ సైన్సు విభాగంలో పార్ట్‌టైం లెక్చరర్‌గా జాయినయ్యారు. 2009లో ఒప్పంద అధ్యాపకుడిగా పదోన్నతి పొందారు. వెంకటయ్య వివిధ జాతీయ సదస్సుల్లో 12పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. వెంకటయ్య 27న వీరస్వామి నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు.

కొమ్మాలకు తరలిన ప్రభబండ్లు

నర్సంపేట/చెన్నారావుపేట, మార్చి 26: నర్సంపేట నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ ప్రభబండ్లను కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతరకు తరలించారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో నర్సంపేట, దుగ్గొండి, చెన్నారావుపేట, నల్లబెల్లి మండలాల నుంచి మంగళవారం ప్రభబండ్లు తరలివెళ్లాయి. పెద్ది కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. బీఆర్ఎస్ ప్రభబండ్లతో వరంగల్-నర్సంపేట రహదారి గులాబీమయమైంది. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు. అలాగే, చెన్నారావుపేట మండలం నుంచి కొమ్మాలకు బీఆర్ఎస్ ప్రభబండ్లు భారీగా తరలివెళ్లాయి. మండలకేంద్రంలోని ఈర్యతండాతోపాటు ఖాదర్‌పేట, కల్‌నాయక్‌తండా, కోనాపురం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు డప్పుచప్పుళ్లతో కొమ్మాలకు ప్రభబండ్లతో వెళ్లారు. నాయకులు కృష్ణచైతన్య, కుమారస్వామి, రజిత వీరన్నానాయక్, కంది కృష్ణారెడ్డి, రఫీ పాల్గొన్నారు.

ప్రభబండి ప్రదర్శనలో పాల్గొన్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

నర్సంపేట నుంచి కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతరకు పెద్ద ఎత్తున కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రభబండ్లు తరలివెళ్లాయి. ఈ కార్యక్రమాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, మహబూబాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ మంగళవారం కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

నర్సంపేట నుంచి బీజేపీ ఆధ్వర్యంలో ప్రభబండ్లను తరలించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి నర్సింహరాములు, కంభంపాటి పుల్లారావు, గోగుల ప్రతాప్‌రెడ్డి, రేసు శ్రీనివాస్, శీలం రాంబాబు, సందీప్ పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఖిలావరంగల్, మార్చి 26: పార్లమెంటు ఎన్నికల పోలింగ్ సిబ్బందికి మొదటి ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్ఐసీ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో పోలింగ్ సిబ్బందికి మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన 809 పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే 4,338 మంది సిబ్బందికి మొదటి విడుత ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించామన్నారు. ఇందులో 1,072 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1082 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 2,184 మంది ఇతర పోలింగ్ అధికారులు ఉన్నట్లు తెలిపారు. ప్రతి టీమ్‌లో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు పోలింగ్ ఆఫీసర్లు ఉంటారన్నారు. 25 శాతం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామన్నారు. వీరికి శిక్షణ ఇస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో శ్రీనివాస్, ఏవో శ్రీకాంత్, ఎన్ఐసీ అప్పిరెడ్డి పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించిన ఆర్టీసీ

వరంగల్, మార్చి 26 : హనుమకొండ బస్‌స్టేషన్ ఆస్తి పన్నును ఆర్టీసీ అధికారులు బల్దియాకు చెల్లించారు. మంగళవారం డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్‌కు ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రావు రూ. 27.82 లక్షల చెక్కును అందజేశారు. ఈ నెల 31వ తేదీ వరకు ఆస్తి పన్నులను చెల్లించి వడ్డీపై 90 శాతం మాఫీ పొందాలని కోరారు. ఆర్‌వో యూసుఫొద్దీన్, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న విజయచందర్‌రెడ్డి, వీసీ రమేశ్

రక్తదానం ప్రాణదానంతో సమానం

- యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలి
- కేయూ వీసీ రమేశ్

హనుమకొండ, మార్చి 26 : రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ పిలుపునిచ్చారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి హాజరై రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయడం సామాజిక సేవా కార్యక్రమంగా భావించి తలసేమియా బాధితులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, కేయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పుల్లా రమేశ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీదేవి, చందులాల్, శ్రీనివాస్, హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ విజయ చందర్‌రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో సౌందర్యలహరి స్తోత్రం

కాశీబుగ్గ, మార్చి 26: కాశీవిశ్వేశ్వరాలయంలో మంగళవారం ఓరుగల్లు సౌందర్యలహరి భక్త మండలి బృందం ఆధ్వర్యంలో సౌందర్య లహరి స్తోత్రం, శివానందల హరి పారాయణాన్ని కనుల పండువగా నిర్వహించారు. దీంతో కాశీబుగ్గ పుర వీధుల్లో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బయ్యాస్వామి, గోనె జగదీశ్వర్, ఓరుగంటి కొమురయ్య, బొడకుంట్ల వైకుంఠం, బొమ్మగాను కృష్ణమూర్తి, శోభారాణి, జయశ్రీ పాల్గొన్నారు.

హోమ్ ఓటింగ్ సభ్యులను గుర్తించాలి

సంగెం, మార్చి 26 : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో 85 సంవత్సరాలు పైబడి పోలింగ్‌స్టేషన్‌కు రాలేని వారిని గుర్తించాలని తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని బీఎల్వోలకు అవగాహన సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, సెక్టోరల్ అధికారులు చట్ల యాకయ్య, రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా నర్సింహస్వామి జాతర

గీసుగొండ, మార్చి 26 : కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర రెండో రోజు మంగళవారం వైభవంగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు జాతరకు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 380 మంది భక్తులకు వైద్యులు పరీక్షలు చేసి మందులను అందించారు.

ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన..

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా రాజకీయ పార్టీల నాయకులు రాజకీయ ప్రభలు, ఫ్లెక్సీలను జాతరలో ఏర్పాటు చేశారు. వివిధ పార్టీల నాయకులు ర్యాలీలు చేస్తూ ప్రభ బండ్లను జాతరకు తీసుకొచ్చారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కొమ్మాల స్టేజీ వద్ద కాంగ్రెస్ ప్రభ బండిని ప్రారంభించారు. రాజకీయ ప్రభ బండ్ల రాకతో ట్రాఫిక్ స్తంభించి భక్తులు ఇబ్బందులు పడ్డారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

గిర్మాజీపేట, మార్చి 26: వరంగల్ స్టేషన్‌రోడ్డులోని ఆకారపు వారి గుడిలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు అర్చకుడు లంకా శివకుమార్‌శర్మ పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు వసంతోత్సవాన్ని కనులపండువగా చేపట్టారు. బ్రహ్మోత్సవాల్లో చివరిఘట్టమైన 'ఊంజల్ సేవ'ను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు.

ఘనంగా ఆలయ ఆవిర్భావ వేడుకలు

నర్సంపేట, మార్చి 26: పట్టణంలో అయ్యప్ప ఆలయ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని నిర్మించి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, రజిని దంపతులు, దొడ్డ రవీందర్‌గుప్తా, మాదారపు చంద్రశేఖర్, శ్రీరాం ఈశ్వరయ్య, దోమకుంట్ల సదానందం, వంగేటి గోవర్ధన్, చింతల కమలాకర్, ఆకుల ప్రభాకర్, దొడ్డ వేణు పాల్గొన్నారు.

ఫిజికల్ సైన్స్ పరీక్షకు 15 మంది గైర్హాజరు

గిర్మాజీపేట, మార్చి 26: పదో తరగతి ఫిజికల్ సైన్స్ పరీక్షకు 15 మంది గైర్హాజరైనట్లు డీఈవో డీ వాసంతి తెలిపారు. 9,455 రెగ్యులర్ విద్యార్థులకు 9,442, 68 మంది ప్రైవేట్ విద్యార్థులకు 66 మంది హాజరయ్యారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో తెలిపారు.

వ్యవసాయ పరికరాలు అపహరణ

నల్లబెల్లి, మార్చి 26: రంగాపూర్ గ్రామంలో వ్యవసాయ పరికరాలు సోమవారం రాత్రి అపహరణకు గురయ్యాయి. బాధిత రైతు కథనం ప్రకారం.. రంగాపూర్ గ్రామానికి చెందిన రైతు భట్టు సాంబయ్యకు ముచ్చింపుల శివారులో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. బోరుబావి వద్ద ఉన్న మోటర్ స్టార్టర్‌తోపాటు ప్లాస్టిక్ పైపులు, విద్యుత్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపాడు.

మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలి

పరకాల, మార్చి 26 : నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు సూచించారు. మంగళవారం మండలంలోని కామారెడ్డిపల్లి, పోచారం, వెల్లంపల్లి గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో భాస్కర్, జీపీ ప్రత్యేకాధికారి రాజకుమారి పాల్గొన్నారు.

ఘనంగా రేణుకాఎల్లమ్మ కల్యాణం

కాశీబుగ్గ, మార్చి 26: వరంగల్ 19వ డివిజన్ ఓసిటీ రోడ్డులోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం గంగపూజ, ఉట్ల బంగారం తెచ్చుట, మంగళవారం అమ్మవారి కల్యాణాన్ని ఒగ్గుపూజారులతో పట్నం వేసి జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఎల్లమ్మ తల్లి కల్యాణంలో పాల్గొన్న భక్తులు